క్లుప్తంగా

విజేతలకు బహుమతులు అందజేత



నగరంపాలెం: పోటీ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ప్రతిభ కనబరిచాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన 18 మంది విజేతలకు నగదు బహుమతులను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి(పరిపాలన), హనుమంతు(ఏఆర్) పాల్గొన్నారు.

కన్నా స్కూల్లో దీపావళి వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్టీసీ కాలనీలోని కన్నా స్కూల్లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా కన్నా విద్యాసంస్థల అధినేత కన్నా మాస్టారు చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటామని తెలిపారు. పండుగ రోజున ఇంటిని దీపాలతో అలంకరించుకుని, బాణసంచా కాల్చడంలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారని, వారికి తగు జాగ్రత్తలు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణలతో వచ్చిన చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్షే కిడ్స్ స్కూల్లో హాలోవిన్ కార్యక్రమం



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని అక్షే కిడ్స్ స్కూల్లో బుధవారం హాలోవిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ నందమూరి దీప్తి మాట్లాడుతూ వివిధ రకాల సంస్కృతులు, సంప్రదాయాలను తెలుసుకోవడం నేటి తరం బాలలకు అవసరమేనని అన్నారు. చిన్నారులను తీర్చిదిద్దడంలో అక్షే కిడ్స్ స్కూల్ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని పేర్కొన్నారు. చిన్నారులు విచిత్ర వేషధారణతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాగంధ్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమైక్యత దేశానికి రక్షణ కవచం వంటిది



గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలోని అన్ని ప్రాంతాలు సమైక్యతతో ఉండటమే దేశానికి రక్షణ కవచం వంటిదని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్పీ స్కూల్లో బుధవారం మాజీ ఉప ప్రధాని, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. అంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు గుజ్జనగుండ్ల సెంటర్ వరకు సమైక్యతా ర్యాలీ నిర్వహించారు.

ముందస్తు దీపావళి వేడుకలు

కేఎల్పీ స్కూల్లో ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో నరకాసురుని దహనం చేశారు. కరస్పాండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య పాల్గొన్నారు.

ఊపిరితిత్తులను భద్రంగా కాపాడుకోండి

- పెరుగుతున్న ఊపిరితిత్తుల సమస్యల బాధితులు
- అక్టోబర్ 'జాతీయ ఊపిరితిత్తుల నెల'



గుంటూరు మెడికల్: మనిషి శ్వాస తీసుకుంటేనే ప్రాణాలతో ఉంటాడు. శ్వాస తీసుకునేందుకు ఊపిరితిత్తులు ఎంతో కీలకం. ఒక్కరోజులో దాదాపు 25,000 సార్లు ఊపిరి తీసుకుంటాడు. మనం పీల్చే గాలిలోఆక్సిజన్, నత్రజని, తక్కువ మొత్తంలో ఇతర వాయువులు, తేలియాడే బ్యాక్టీరియా, వైరస్, వాతావరణంలో ఉండే వివిధ రకాల కాలుష్య కారకాలు ఉంటాయి. ఊపిరితిత్తులు ఆక్సిజన్‌ను శరీరం అంతా పంపిణీ చేస్తాయి. ఆధునిక జీవన శైలి వల్ల ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నమై ఊపిరి తీసుకోవడం కష్టమైపోయి కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబరును జాతీయ ఊపిరితిత్తుల నెల'గా నిర్ణయించి అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో బాధితులు ...

జిల్లాలో 40 మంది పల్మనాలజిస్టులు(ఊపిరితిత్తుల స్పెషాలిటీ వైద్య నిపుణులు) సేవలందిస్తున్నారు. ఒక డాక్టర్ వద్దకు ప్రతిరోజూ 15 నుండి 20 మంది ఊపిరితిత్తుల సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు గోరంట్లలోని ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల ఆస్పత్రిలో ప్రతి రోజూ 30 నుంచి 50 మంది వివిధ రకాల ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలో చికిత్స పొందుతున్నారు.

వ్యాధిని గుర్తించడం ఎలా..

ఎక్కువగా దగ్గు, ఆయాసం, పిల్లికూతలు, ఛాతి పట్టివేయడం లాంటి లక్షణాలు కనిపిస్తే అది సీఓపీడీ వ్యాధిగా గుర్తించాలి. తరచు జలుబు చేయడం, వళ్లు దురద, కళ్లు మంటలు, కొన్ని రకాల ఆహార పదార్థాలు, వాసనలు, సరిపడకపోవడం లక్షణాలను ఎలర్జీగా గుర్తించాలి. జ్వరం, కళ్లెతో కూడిన దగ్గు, శ్వాస తీసుకునేటప్పుడు ఛాతి నొప్పి ఉంటే దానిని నిమోనియా వ్యాధిగా భావించాలి. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం, వంటి లక్షణాలు కనిపిస్తే ఊపిరితిత్తులకు వచ్చే క్షయ వ్యాధిగా గుర్తించాలి. దగ్గుతున్నప్పుడు రక్తం పడడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం లంగ్ క్యాన్సర్ లక్షణాలు. పొడి దగ్గు, ఆయాసం, కీళ్ల నొప్పులు ఉంటే ఊపిరితిత్తులకు వచ్చే ఐఎల్‌డీ వ్యాధిగా గుర్తించాలి.

ముందస్తు చర్యలు తీసుకోవాలి....



ఊపిరితిత్తుల వ్యాధులను ముందస్తు జాగ్రత్తలతో చాలా వరకు నివారించవచ్చు. గుట్కా, పాన్‌పరాగ్, ఖైనీ, పొగతాగడం, విడనాడాలి. పొగ, దుమ్ముధూళి ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. మంచి ఆహారపు అలవాట్లు కలిగిఉండాలి. అలర్జీ పదార్థాలకు దూరంగా ఉండాలి. 60 ఏళ్ళు పైబడిన వారంతా క్రమం తప్పకుండా ఫ్లూ, నిమోనియా వ్యాక్సిన్లు వేయించుకోవడం వల్ల ఊపిరితిత్తుల జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చు. పౌష్టికాహారం తీసుకోవడం తోపాటు, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం, ప్రాణాయామం, చేయడం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు.

–డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు.

హరిత దీపావళి జరుపుకుందాం

నగర కమిషనర్ శ్రీనివాసులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగర ప్రజలు దీపావళి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. కాలుష్య నియంత్రణ మండలి గో గ్రీన్...గ్లో బ్రైట్ నినాదంతో హరిత దీపావళి జరుపుకోవాలని రూపొందించిన పోస్టర్‌ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ ఎండీ నజీనా బేగం, డీఈఓ రేణుక, ఉపా సెల్ పీఓ రామారావు, గ్రీన్ కోర్ కన్వీనర్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

నేడు నగరంలో 2కే రన్

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని గురువారం రాష్ట్రీయ ఏక్తా దివస్ 2కె రన్ ఫర్ యూనిటిని స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి హిందూ కాలేజి జంక్షన్ వరకు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ రన్‌లో జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని బుధవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో 2కె రన్ ఏర్పాట్లకు సంబంధించి డీఈఓ, డీఆర్‌డీఏ, జిల్లా పరిషత్, జీఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈఓ రేణుక, జీఎంసీ డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెహికల్ షెడ్‌కి కాంపౌండ్ వాల్ నిర్మించాలి

నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌ని సమగ్ర సర్వే చేసి, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం కమిషనర్ కేవీపీ కాలనీలోని జీఎంసీ వెహికిల్ షెడ్, విద్యానగర్ 3లైన్‌లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వాహనాల పనితీరుని సమీక్షించి, ప్రతి వాహనం రన్నింగ్‌లో ఉండాలని, మరమ్మతులు 24 గంటల్లో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నూతన స్వీపింగ్ యంత్రాలను ప్రాంతాల వారీగా మ్యాపింగ్ చేసి, ప్రజారోగ్య అధికారులకు కేటాయించాలని కోరారు. ఈ-ఆటోలను ఏజెన్సీ ప్రతినిధులతో సమన్వయం చేసుకొని పూర్తి స్థాయిలో రన్నింగ్‌లోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. షెడ్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి ఆయిల్ తయారీ యూనిట్‌ని వినియోగంలోకి తీసుకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, కార్పొరేటర్ కే కోటేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు రమేష్, సతీష్, ఏసీపీలు రెహ్మాన్, వెంకటేశ్వరరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, రాంబాబు, ఎస్.ఎస్. సోమశేఖర్ పాల్గొన్నారు.

బజరంగ్ ఆధ్వర్యంలో 40 వేల మట్టి ప్రమిదలు పంపిణీ



మట్టి ప్రమిదల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): పిల్లలు, పెద్దలు ఎంతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరుపుకునే దీపావళి పండగను పురస్కరించుకొని బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టాభిపురంలోని గ్రీన్ గ్రేస్ ఆవరణలో పర్యావరణ హితంగా 40 వేల మట్టి ప్రమిదల పంపిణీని బుధవారం ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ ప్రారంభించారు. నగర ప్రజలు భారీగా తరలివచ్చి మట్టి ప్రమిదలను తీసుకెళ్లారు. సంప్రదాయబద్ధంగా మట్టి ప్రమిదలు, వత్తులు పకడ్బందీగా ప్యాక్ చేసి అందించడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ దీపావళి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాజహిత పర్యావరణహిత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. గత వినాయక చవితి పండుగ సందర్భంగా ఏడు వేల మట్టి వినాయ ప్రతిమలను పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో బజరంగ్ ఫౌండేషన్ డైరెక్టర్లు సిద్దినేని శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, గ్రీన్ గ్రేస్ ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చు



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ, నాట్కో క్యాన్సర్ సెంటర్ కో ఆర్డినేటర్ అశోకకుమార్

గుంటూరు మెడికల్: రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని బుధవారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండి, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చు అన్నారు. మామోగ్రామ్ పరీక్ష ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చని చెప్పారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ కో ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్ మాట్లాడు తూ రొమ్ము క్యాన్సర్ బాధితులకు అత్యాధునిక వైద్య సౌకర్యాలతో, అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఉచిత వైద్య సేవ లు అందిస్తున్నామని వివరించారు. రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించే మామో గ్రామ్ వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. క్యాన్సర్ బాధితులకు మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేసి, కీమో, రేడియేషన్ వైద్య సేవలు సైతం ఉచితంగా అందిస్తున్నామన్నారు. గుంటూరు జీజీహెచ్ నుంచి నాజ్ సెంటర్ మీదుగా మార్కెట్ సెంటర్ వరకు జరిగిన అవగాహన ర్యాలీలో రేడియోథెరపి వైద్య విభాగాధిపతి డాక్టర్ దుర్గాప్రసాద్, మెడికల్ అంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి.శివరామకృష్ణ, చలపతి ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటరామారావు, డాక్టర్ రాజేష్‌బాబు, డాక్టర్ కె.శ్రీనివాసరావు, చలపతి ఫార్మసీ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ ఐక్యత, సమగ్రత కాపాడాలి

రైల్వే డీఆర్ఎం రామకృష్ణ



రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ, సైమన్ తదితరులు

లక్ష్మీపురం: దేశం ఐక్యత, సమగ్రత కాపాడటానికి ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో బుధవారం రాష్ట్రీయ ఏక్తా దివస్(జాతీయ ఐక్యత దినోత్సవం)ను నిర్వహించారు. ముందుగా రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞను డివిజన్ సంబంధిత అధికారులతో కలసి ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయ ఏకీకరణలో ప్రధాన పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా అక్టోబర్ 31వ తేదీన పండుగ వాతావరణంలో ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. గురువారం దీపావళి పండుగ నేపథ్యంలో ఒక రోజు ముందుగానే జరుపుకోవడం జరిగిందన్నారు. డివిజన్ పరిధిలోని కింది స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడం వలనే ఇంతటి అభివృద్ధిలో ఉన్నామని వివరించారు. కార్యక్రమంలో డివిజన్ ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీఓఎం షహబాజ్ హనూర్, సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్ కో ఆర్డినేషన్ జె.వి.అనూష, సీనియర్ డీసీఎం డాక్టర్ సిహెచ్.ప్రదీప్‌కుమార్, సీనియర్ డీఓఎం దినేష్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సత్యానారాయణ, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బి.రాజ్, సీనియర్ డీఎంఈ రవికిరణ్, ఏఎస్‌సీ శైలేష్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు



సరస్వతీదేవి పూజాలో చిన్నారులు, ఉపాధ్యాయులు



శ్రీపూజిత స్కూల్లో సంప్రదాయ వస్త్రాలతో విద్యార్థినులు



నారాయణ స్కూల్లో టపాసులు కాల్చుతున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లోని లిటిల్ చాంప్స్‌లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో శ్రీసరస్వతీదేవి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయ బృందం అమ్మవారి విగ్రహం వద్ద దీపాలు వెలిగించారు. విద్యార్థులతో బాణసంచా కాల్పించారు. నగరంలోని భాష్యం క్యాంపస్‌లలో దీపావళి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ శిరీష పాల్గొన్నారు.

శ్రీపూజితలో..

పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రాంగణంలో నరకాసురుని దిష్టిబొమ్మను దహనం చేశారు. పాఠశాల గౌరవ డైరెక్టర్ కంచర్ల హరిప్రసాదరావు, ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడారు. స్తంభాలగరువులోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో జరిగిన ముందస్తు దీపావళి వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్లు సీతారామయ్య, అనుపమ, షమీమ్, ఏఓ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఆర్ ఎస్ఐ మృతి



నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని యూనిట్ ఆసుపత్రి అధికారి అయిన ఆర్ఎస్ఐ కె.మాణిక్యరావు(59) మంగళవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. కేవీపీ కాలనీలోని ఆయన ఇంటి వద్ద భౌతిక కాయాన్ని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందించారు. జిల్లా ఏఎస్పీ హనుమంతు(ఏఆర్), డీఎస్పీ శాంతికుమార్, పోలీస్ అధికారులు, సహచర ఉద్యోగులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: సర్దార్ వల్లభాయ్ పటేల్ చిరస్మణీయుడని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. సీనియర్ ఇంజినీర్ పి.ఘనశ్యామచార్యులు, సీనియర్ సిటిజన్స్ నాయకులు కె.సాంబయ్య పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

లక్ష్మీపురం: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, కుల మతాలకు అతీతంగా ప్రతి ఏటా గ్యార్మీ నెలలో ప్రపంచ ఆధ్యాత్మిక గురువు మహబూబ్ సుభాని బాబా వారి జెండా పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని గ్యార్మి వేడుకల నిర్వాహకులు యాసీన్ అన్నారు. స్థానిక తూర్పు నియోజకవర్గ పరిధిలోని చిన్న బజారులోని చిన్న మౌలాపంజా ఆషూర్ ఖానాలో బుధవారం గార్మి వేడుకలు ముతవల్లి షేక్ ఖాదర్ బాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

అపార్‌తో కష్టాలు, సమయం వృథా

గుంటూరు ఎడ్యుకేషన్: అపార్ సంఖ్యను కేటాయించేందుకు చేపట్టిన నమోదు ప్రక్రియతో ఉపాధ్యాయులకు కష్టాలతో పాటు సమయం వృథా అవుతోందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, ఎండీ ఖాలీద్ పేర్కొన్నారు. అపార్‌తో ఎదురవుతున్న ఇబ్బందులపై డీఈఓ సీవీ రేణుకను బుధవారం డీఈవో కార్యాలయంలో కలసి వినతి పత్రం సమర్పించారు. అపార్ ఐడీలను క్రియేట్ చేసేందుకు ఎదురవుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఆధార్‌లో తప్పులు, యూడైజ్ ప్లస్‌లో తేడాలతో అపార్ నమోదు సాధ్యం కావడం లేదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం కావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం కావాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను పేర్కొన్నారు. బుధవారం డీఈఓ రేణుకను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆమెకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధితో పాటు ఉపాధ్యాయులతో స్నేహపూర్వక వాతావరణాన్ని మరింతగా పెంచేందుకు విద్యాశాఖ కృషి చేస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జువ్వా జ్ఞానేశ్వరరావు, బి. కుమార్‌రాజా, మహిళా శాఖ అధ్యక్షురాలు కె.పద్మకోటి, నాయకులు కె.ఆనందరావు, శ్యామల, ఎన్.సుధాకర్‌రావు, డి.యలమంద పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే క్యాన్సర్ నివారణ

జీజీహెచ్ నాట్కో మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టీవీ శివరామకృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ టీవీ శివరామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించడం ద్వారా నూరు శాతం నివారణ సాధ్యమని గుంటూరు సమగ్ర ప్రభుత్వాస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టీవీ శివరామకృష్ణ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం సుజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత విభాగం సహకారంతో మహిళల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రతి 19 సెకన్లకు ఒకరు క్యాన్సర్ బారిన పడుతుండగా, దేశంలో ఇప్పటికే 25 లక్షల మంది క్యాన్సర్ పీడితులు ఉన్నారని వివరించారు. క్యాన్సర్ రోగులకు వివిధ స్థాయిలో చికిత్స ఉంటుందని, కోలుకున్న తరువాత నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో పూర్తి స్వస్థత పొందవచ్చని తెలిపారు. సర్జికల్ అంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.జాహ్నవి మాట్లాడుతూ జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో క్యాన్సర్‌కు సంబంధించి అన్ని రకాల పరీక్షలు, ఆపరేషన్లు, మందులు, ఉచితంగా అందజేస్తారని వివరించారు. సుజయ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ జ్యోతుల మురళీకృష్ణ మాట్లాడుతూ విద్య, వైద్యం, సాధికారత అంశాలపై సుజయ ఫౌండేషన్ నిరంతరం పనిచేస్తోందని, యేటా అక్టోబరులో క్యాన్సర్ నిర్మూలన మాసోత్సవం సందర్భంగా అవగాహన సదస్సుల ద్వారా వందలాది మందిని చైతన్యవంతులను చేస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో డాక్టర్ ఎస్.మురళి, డాక్టర్ అంకారెడ్డి, డాక్టర్ డాలిన్, వినయ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పరుచూరి విజయలక్ష్మి, అధ్యాపకులు భవాని, ధాత్రికుమారి పాల్గొన్నారు.

దీపావళిని పర్యావరణ హితంగా చేసుకోవాలి

పర్యావరణ ఇంజినీర్ నజీమా బేగం



విద్యార్థులతో నజీమా బేగం,కేవీ సెబాస్టియన్

గుంటూరు ఎడ్యుకేషన్: దీపావళిని పర్యావరణ హితంగా జరుపుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ ఎండీ నజీమా బేగం పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 'వెలుగుల పండుగ దీపావళి- శబ్దాల పండుగ' కాదనే నినాదంతో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నజీమా బేగం మాట్లాడుతూ మన పూర్వీకులు వర్షాకాలం అనంతరం వచ్చే దీపావళి పండుగ క్రిమి కీటకాలను నశింపజేసేందుకు సంప్రదాయ బద్ధంగా జరిపేవారని, ప్రస్తుత ఆధునిక జీవన విధానం వికృత రూపం దాల్చి, అందరికీ హానికరంగా మారడం దురదృష్టకరమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్ మాట్లాడుతూ వృద్ధులు, గుండె జబ్బు బాధితులు, పశు పక్ష్యాదులకు ఇబ్బంది కలుగకుండా, అధిక శబ్దాన్ని చేసే క్రాకర్స్ కాల్చవద్దని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ గ్రీనరీ ప్రాజెక్టు అధికారి జె.రామారావు, నోడల్ అధికారి డి.తిరుపతిరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ సెబాస్టియన్ పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాద వితరణ

నెహ్రూనగర్: శ్రీ బాలమణికంఠ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదర్శనగర్‌లోని కోదండరామాలయంలో అయ్యప్ప మాలధారులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం అక్టోబర్ 23 నుంచి దిగ్విజయంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఓనుకూరి సాంబిరెడ్డి, జంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు అయ్యప్ప మాలధారులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం దాతల ఆర్థిక సాయంతో గత 8 సంవత్సరాల నుంచి నిరంటకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రావిపాటి సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.